క్లుప్తంగా

పర్మిట్ రూమ్స్ ఆలోచనను విరమించుకోవాలి

కర్నూలు కల్చరల్: పర్మిట్ రూమ్స్ తెరవాలనే ఆలోచనను కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని అఖిల భారత మహిళా సాంస్కృతిక సంఘం రాష్ట్ర కార్యదర్శి తేజోవతి పేర్కొన్నారు. తాగుడుకు యువత బానిసై లక్షలాది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. మహిళలకు రక్షణగా నిలుస్తామని పేర్కొన్న కూటమి ప్రభుత్వం పరిమిట్ రూమ్స్‌కు అనుమతి ఇవ్వడం దారుణమని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని మార్చుకోవాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ఇంటర్ ఫెయిలైన వారికి ఉద్యోగ అవకాశాలు

కర్నూలు(హాస్పిటల్): ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు జీడీఏ, ఐసీయూ, ఓటీ అసిస్టెంట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు బొల్లినేని మెడ్స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్. నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పాసైన విద్యార్థులకు బీఎస్సీ/డిప్లొమా పారా మెడికల్/నర్సింగ్/బీపీటీ కోర్సుల్లో ప్రవేశాలు జరుగుతున్నాయన్నారు. ఆసక్తి ఉన్న వారు స్థానిక జొహరాపురం రోడ్డులోని కిమ్స్ హాస్పిటల్‌లోని బొల్లినేని మెడ్స్కిల్స్ (8686594534, 7680945357)ను సంప్రదించాలన్నారు.

క్లస్టర్ యూనివర్సిటీలో శిక్షణ

కర్నూలు కల్చరల్: హైదరాబాద్ ఐఐటీ, తిహాన్ ఫౌండేషన్, కర్నూలు ఐఐటీ డీఎం ఆధ్వర్యంలో క్లస్టర్ యూనివర్సిటీలో నేటి నుంచి నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని శిక్షణ కన్వీనర్లు డాక్టర్ మొహమ్మద్ వాయిజ్, డాక్టర్ ఎం.పద్మావతి లక్ష్మణ గుప్త పేర్కొన్నారు. మంగళవారం శిక్షణకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న 50 మంది ఎస్సీ విద్యార్థులకు ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు 'రిమోట్లీ ఆపరేటెడ్ వెహికల్స్ -డ్రోన్స్' అనే అంశంపై శిక్షణ ఉంటుందన్నారు. ఇతర కులాలకు చెందిన 50 మంది విద్యార్థులకు 'బూట్ క్యాంప్ డ్రోన్ టెక్నాలజీ' అనే అంశంపై శిక్షణ ఉంటుందన్నారు. ఉచితంగా నిర్వహిస్తున్న శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జాబ్స్ మేనేజర్ బాధ్యతల స్వీకరణ

కర్నూలు(అగ్రికల్చర్): డీఆర్‌డీఏ-సీడాప్ జాబ్స్ ఇన్‌చార్జ్ మేనేజర్‌గా ఆశోక్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. జాబ్స్ మేనేజర్‌గా వెంటనే విధుల్లో చేర్చుకోవాలని ఒకవైపు సెర్ప్ అధికారుల నుంచి, మరో కూటమి పార్టీ నేతల నుంచి ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. అన్ని వైపులా నుంచి ఒత్తిడి రావడంతో జాబ్స్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించడానికి డీఆర్‌డీఏ పీడీ వైవి రమణారెడ్డి అనుమతి ఇచ్చినట్లు సమాచారం. భారీగా ముడుపులు ముట్టచెప్పడంతో సెర్ప్ చరిత్రలో ఎపుడూ లేని విధంగా ట్రైనర్‌గా చేరిన మూడు నెలల్లోనే కీలకమైన పోస్టు సంపాదించారనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

'హారిజాన్స్'లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

కల్లూరు: కర్నూలు నగరంలోని గణేష్ నగర్‌లో ఉన్న హారిజాన్స్ ఇంటర్ నేషనల్ ప్లే స్కూల్‌లో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ ప్రదీప్‌కుమార్, డైరెక్టర్ పావని మాట్లాడుతూ వేసవి సెలవుల్లో చిన్నపిల్లలపై తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. హారిజాన్స్ స్కూల్‌కు లండన్ కేంబ్రిడ్జి యూనివర్సిటీ నుంచి గుర్తింపు లభించడం అభినందనీయమన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి

గడివేముల: ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేద ప్రజలకు అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌ఓ శారదా బాయి అన్నారు. మంగళవారం గడివేముల పీహెచ్‌సీని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించాలన్నారు. కుష్టు వ్యాధి నివారణకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలను తీసుకుంటోందని తెలిపారు. వ్యాధిగ్రస్తులను సకాలంలో గుర్తించి సేవలు అందించాలని తెలిపారు. ఆమె వెంట డాక్టర్లు తేజస్విని, రంజితకుమారి, ఎంపీహెచ్‌ఈఓ మహేశ్వరరెడ్డి, సూపర్‌వైజర్ మనోహర్, ఫార్మసిస్ట్ రాజ్‌కుమార్ భారతి ఉన్నారు.

గిరక పందెం విజేత లక్ష్మీపురం ఎద్దులు

వెల్దుర్తి: రామళ్లకోట వనం శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఎద్దుల గిరక బండి లాగు పోటీల్లో విజేతగా లక్ష్మీపురం చిన్న అయ్యన్న ఎద్దులు నిలిచి రూ.20వేల నగదు బహుమతి గెలుచుకున్నాయి. 16 జతల ఎద్దులు పాల్గొన్న పోటీల్లో తర్వాతి మూడు స్థానాలలో వరుసగా వనపరి జిల్లా పవన్ ఎద్దులు, బోయనపల్లె కాంతారెడ్డి ఎద్దులు, బొమ్మిరెడ్డిపల్లె మనోజ్ ఎద్దులు నిలిచి వరుసగా రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు గెలుచుకున్నాయి. స్లోబైక్ రేసులో విన్నర్‌గా చనుగొండ్ల సుధాకర్, రన్నర్‌గా రామళ్లకోట మధు నిలిచి రూ.3వేలు, రూ.2వేలు గెలుచుకున్నారు. ట్రాక్టర్ రివర్స్ పందెంలో బోయనపల్లె రవి విన్నర్‌గా, రామళ్లకోట దేవలు నిలిచి వరుసగా రూ.2,500లు, రూ.1,500 గెలుచుకున్నారు. గుండు ఎత్తు పందెంలో పసుపుల వీరభద్రుడు, చందా ఎత్తు పందెంలో పసుపుల హుసేన్ విజేతలుగా నిలిచి రూ.5వేలు, రూ.4వేలు గెలుచుకున్నారు.

- నగరానికి తలమానికంగా నిలిచిన వీనస్ పార్కు
- గత ప్రభుత్వం 168 అడుగుల ఎత్తులో జాతీయ జెండా ఆవిష్కరణ
- జెండా మాయమై కళ తప్పిన పార్కు

అ'జెండా' మరిచారు!


వీనస్ పార్కులో జాతీయ జెండా లేక బోసి పోయిన దృశ్యం

కర్నూలు (టౌన్): నగర అభివృద్ధితో పాటు సుందరీకరణకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో కృషి చేసింది. ఉద్యానవనాల అభివృద్ధి, ప్రధాన కూడళ్లలో కళాత్మక ఆకృతులు ఏర్పాటు చేసింది. రూ.8 కోట్లు వెచ్చించి ఎన్నో థీమ్ పార్కులను అందంగా తీర్చిదిద్దింది. వాటిని సంరక్షించడంలో మున్సిపల్ అధికార యంత్రాంగం వైఫల్యం చెందిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మూడున్నరేళ్ల క్రితం 2021 డిసెంబర్ నెల 2వ తేదీన రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా 44వ వార్డు వీనస్ కాలనీ పార్కులో 168 అడుగుల ఎత్తులో అప్పట్లో నగరపాలక సంస్థ వైఎస్సార్‌సీపీ పాలకవర్గం ఈ జాతీయ జెండాను ఆవిష్కరించింది. అలాగే వీనస్ కాలనీ పార్కులో రాఫ్యూటిక్ గార్డెన్ (పంచతత్వ నడక మార్గం), గ్రీనరీ, ఓపెన్ జిమ్ వంటి సౌకర్యాలు ఉన్నాయి. దీంతో నగర ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. నిత్యం ప్రైవేటు పాఠశాలలకు చెందిన ప్రైమరీ విద్యార్థులను ఈ పార్కు సందర్శనకు తీసుకొచ్చేవారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వీనస్ పార్కు నిర్లక్ష్యానికి గురయ్యింది. జాతీయ జెండా లేక పార్కు బోసిపోయింది. మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఎందుకు పట్టించుకోవడం లేదో ఎవరికీ తెలియడం లేదు.

కటౌట్లపై ఉన్న శ్రద్ధ జాతీయ జెండాపై లేదు



నాలుగేళ్లగా వైఎస్సార్‌సీపీ పాలకవర్గంలో నగరంలో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయి. వీనస్ కాలనీలో జాతీయ జెండా ఎంతో మందిని ఆకర్షించింది. నగరానికే ఈ పార్కు వన్నె తీసుకువచ్చింది. అయితే ఇప్పుడు జాతీయ జెండా లేక వెలవెలబోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. నగరంలో ఎక్కడ పడితే అక్కడ 50 నుంచి 60 అడుగుల ఎత్తులో నేతల కటౌట్లు ఏర్పాటు చేశారు. వాటి మీద ఉన్న శ్రద్ధ జాతీయ జెండాపై ఎందుకు లేదో అర్థం కావడం లేదు.

– వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి


వీనస్ పార్కులో రెపరెపలాడుతున్న జాతీయ జెండా (ఫైల్)

క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు (టౌన్): జిల్లాలో పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో మే 1 నుంచి 31వ తేదీ వరకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతి రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు అర్హత కలిగిన జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయి, సీనియర్ క్రీడాకారులు, 6 వారాల ఎన్ఐఎస్ పూర్తి చేసిన క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలతో ఈనెల 17వ తేదీ లోపు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో అందజేయాలన్నారు. వివరాలకు 9866317318ను సంప్రదించాలన్నారు.

పీఆర్ఓ బదిలీ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థలో పీఆర్ఓగా పనిచేస్తున్న కేఎల్ఎన్ రెడ్డిని ప్రకాశం జిల్లా పొదిలి మున్సిపాల్టీ కమిషనర్‌గా బదిలీ చేసింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం జీవో 303 జారీ చేసింది. నందికొట్కూరు, డోన్, నగరి, పుత్తూరు మున్సిపాల్టీల్లో కమిషనర్‌గా పనిచేసిన ఆయన గత ఏడాది సెప్టెంబర్ నెల నుంచి కర్నూలు నగరపాలక సంస్థ పీఆర్ఓగా పనిచేస్తున్నారు.

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్త పడాలి


మాట్లాడుతున్న డెమో శ్రీనివాసులు శెట్టి

కర్నూలు(హాస్పిటల్): ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా ప్రతి ఒక్కరూ వడదెబ్బకు గురిగాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డెమో శ్రీనివాసులు శెట్టి చెప్పారు. మంగళవారం స్థానిక శ్రీరామనగర్‌లోని 58వ సచివాలయం పరిధిలో వడదెబ్బ నివారణపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు ఉదయం 10 గంటల్లోపు తమ పనులు ముగించుకోవాలన్నారు. తప్పనిసరిగా బయట ఎండలో వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ లేదా తలపై టవల్ పెట్టుకుని, కాళ్లకు చెప్పులు ధరించి వెళ్లాలని సూచించారు. నీళ్ల బాటిల్ తీసుకుని గంట గంటకు నీళ్లు తాగాలని, లేకపోతే శరీరంలోని నీరు, లవణాలు చెమట రూపంలో ఆవిరైపోయి శరీరం నీరసంతో వడదెబ్బకు గురవుతారని తెలిపారు. వడదెబ్బకు గురైన వ్యక్తిని త్వరగా నీడగల ప్రదేశానికి మార్చాలని, గాలి తగిలేటట్లు చూడాలని, దుస్తులు వదులు చేసి, చల్లని నీటిలో ముంచిన బట్టతో తరచూ శరీరం తుడవాలన్నారు. ఓఆర్ఎస్ ద్రావణం లేదా చిటికెడు ఉప్పు, చక్కెర కలిపిన నీటిని, మజ్జిగను తాగించాలని, వీలైనంత త్వరగా వడదెబ్బకు గురైన వ్యక్తిని దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి వైద్య సహాయం అందించే ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు పద్మావతి, రామలక్ష్మి, ఆశా కార్యకర్త పద్మావతి పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన


కొత్తబస్టాండ్‌లో అగ్నిమాపక సిబ్బంది డెమో నిర్వహిస్తున్న దృశ్యం


అగ్నిమాపక వారోత్సవాల కరపత్రాలను పంపిణీ చేస్తున్న సిబ్బంది

కర్నూలు: అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపక శాఖ సిబ్బంది డెమో ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని రెండవ రోజు మంగళవారం కర్నూలులోని సి.క్యాంప్ సర్కిల్, రాజ్‌విహార్, కొండారెడ్డి బురుజు, రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాల్లో అగ్నిమాపక సిబ్బంది డెమో నిర్వహించారు. అగ్నిప్రమాదం సంభవించినప్పుడు ప్రాథమిక దశలో మంటలను ఎలా ఆర్పాలో ప్రాక్టికల్‌గా సిబ్బంది విన్యాసాలు చేసి డెమో ద్వారా చూపించారు. సిబ్బంది చేసిన నీటి విన్యాసాలను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. అగ్నిమాపక శాఖ జిల్లా సహాయ అధికారి వై.చిన్నబజారి ఆధ్వర్యంలో డెమో ద్వారా మంటలను అదుపు చేసే నీటి విన్యాసాలను ప్రజలు ఆసక్తికరంగా తిలకించారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఎటువంటి చర్యలు తీసుకోవాలో తెలిపే కరపత్రాలను కూడా ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది నరేష్ కుమార్ రెడ్డి, రాజా రమేష్ బాబు, వెంకటేశ్వర్లు, లింగమూర్తి, వేణుగోపాల్, రాంబాబు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

చోరీ కేసులో ఆభరణాల రికవరీ


వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ హేమలత

ఆదోని అర్బన్: గత నెల 28వ తేదీన వెంకన్నపేటలో లక్ష్మిశ్వేత ఇంట్లో జరిగిన చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని, ఆభరణాలను రికవరీ చేశారు. సోమవారం స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ హేమలత నిందితుడు వడ్డే రవికుమార్‌ను, అతని వద్ద స్వాధీనం చేసుకున్న బంగారు చైన్, నల్లపూసల దండ, తాళిబొట్టును మీడియాకు చూపించి వివరాలను వెల్లడించారు. పట్టణంలోని వడ్డేగేరికి చెందిన రవికుమార్ గత నెల 28వ తేదీన వెంకన్నపేటలో లక్ష్మిశ్వేత ఇంట్లో చొరబడి ఆమె మెడపై కత్తి పెట్టి బంగారు ఆభరణాలను బలవంతంగా లాక్కొని వెళ్లాడని తెలిపారు. లక్ష్మిశ్వేత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముద్దాయి రవికుమార్‌ను ఈనెల 14వ తేదీన రైల్వేస్టేషన్ వద్ద అదుపులోకి తీసుకొని, అతని వద్ద బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దర్యాప్తులో భాగంగా అనుమానితుడిగా రవికుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారించడం జరిగిందన్నారు. సదరు వ్యక్తి వద్ద చోరీ చేసిన మొత్తం ఆభరణాలు ఉన్నాయని, మొట్టమొదటిసారిగా ఈ దొంగతనం చేశాడని, ఆర్థిక ఇబ్బందులు వల్ల ఈ దొంగతనం చేసినట్లు తెలిపారు.

అవుట్ సోర్సింగ్ లస్కర్లను రెగ్యులర్ చేయాలి


శ్రీశైలం ముంపు బాధితుల ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): శ్రీశైలం ప్రాజెక్టు కోసం సర్వస్వం త్యాగం చేసిన అవుట్ సోర్సింగ్ లస్కర్లను రెగ్యులర్ చేయాలని కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. అంతక ముందు జలమండలి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చి గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అవుట్ సోర్సింగ్ లస్కర్ల సంఘం అధ్యక్షుడు నాగన్న మాట్లాడుతూ.. లస్కర్ల సర్వీసును 62 ఏళ్లకు పెంచాలన్నారు. పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా తమకు వేతనాలు ఇవ్వాలన్నారు. తమ సర్వీసును పరిగణలోకి తీసుకొని పర్మినెంట్ లస్కర్లుగా నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అక్షయ్, రంగస్వామి, గౌస్, మనోహర్, చెన్నయ్య, హుస్సేనయ్య, రఘురాంరెడ్డి, చెంచిరెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఎల్లమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు


ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మ


అమ్మవారి దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులు

కర్నూలు(రూరల్): నగర సమీపంలోని వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. కుంకుమర్చన, ఆకుపూజ చేసి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

క్రైం కార్నర్

చీరకొంగు ట్రాక్టర్‌కు తగిలి..

కర్నూలు (రూరల్): కర్నూలు మండల పరిధిలోని నిడ్జూరు -మునగాల పాడు గ్రామాల మధ్యలో దుర్గమ్మ గుడి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందారు. కర్నూలు తాలూకా పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు నగర పరిధిలోని స్టాంటన్‌పురానికి చెందిన శేఖర్ తన కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం రాత్రి సొంత ఆటోలో రాజోలి గ్రామంలోని సోదరి ఇంట్లో జరిగే శుభకార్యానికి బయలుదేరాడు. మునగాలపాడు సమీపంలో భార్య సుగుణమ్మ (35) చీరకొంగు గాలికి బయటకు రాగా అదే సమయంలో ఎదురుగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ టైర్‌కు చుట్టుకుంది. దీంతో ఆటోలోని మహిళ రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతిచెందింది. ఈ మేరకు మృతురాలి భర్త శేఖర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. కాగా మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. ఈ సంఘటనతో బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

దాడి కేసులో నలుగురు అరెస్టు


నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

కర్నూలు: నగరంలోని డీ-మార్ట్ వెనుక టీడీపీ ఆఫీసులో ఉన్న శేఖర్ గౌడ్‌పై జరిగిన దాడి కేసులో నలుగురు నిందితులను నాల్గవ పట్టణ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. మంగళవారం ఉదయం నిందితులు భూపని ప్రభాకర్ నాయుడు, కాశి బాబు, రహంతుల్లా, పఠాన్ సలాం ఖాన్ తదితరులు ఆర్టీసీ కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్నట్లు సమాచారం అందడంతో నాల్గవ పట్టణ పోలీసులు అరెస్టు చేసి కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్ ఎదుట హాజరుపర్చగా ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. శేఖర్ గౌడ్‌ను నిందితులు చంపడానికి ప్రయత్నించారని తెలిపారు. కర్నూలు బృందావన్ నగర్‌కు చెందిన భూషణ్ గౌడ్ ఫిర్యాదు మేరకు నాల్గవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచినట్లు డీఎస్పీ తెలిపారు. నాల్గవ పట్టణ సీఐ మధుసూదన్ గౌడ్, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి సమావేశంలో పాల్గొన్నారు.

ఆటో ఢీకొని వృద్ధురాలి మృతి

పాణ్యం: ఆటో ఢీకొని వృద్ధురాలు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని కొణిదేడు భూపనపాడు రస్తాలో మంగళవారం చోటుచేసుకుంది. ఏఎస్ఐ ఫజులుల్లా వివరాల మేరకు.. కొణిదేడు గ్రామానికి చెందిన కాటసాని రామలక్ష్మమ్మ (65)పొలం వద్ద ట్రాక్టర్ దిగి రోడ్డు దాటుతుండగా భూపనపాడు వెళ్తున్న ఆటో వేగంగా వచ్చి ఢీకొంది. రామలక్ష్మమ్మ తీవ్రంగా గాయ పడింది. ఆమెను కుటుంబ సభ్యులు శాంతిరామ్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మొదటి కుమారుడు రవిరెడ్డి ప్రస్తుతం కొణిదేడు ఎంపీటీసీ సభ్యుడిగా ఉన్నారు. రెండో కుమారుడు రాజా రెడ్డి రైతు. వృద్ధురాలి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

బైక్‌కు నిప్పుపెట్టిన దుండగులు

సి.బెళగల్: ఇంటి దగ్గర నిలుపుకున్న బైక్‌ను గుర్తు తెలియని దుండగులు నిప్పుపెట్టారు. మండల పరిధిలోని కొండాపురంలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొండాపురం గ్రామానికి చెందిన శాంసన్ అలియాస్ చిన్న నాగ రాజు రోజులాగానే సోమవారం రాత్రి బైక్‌ను ఇంటి బయట నిలిపి ఇంట్లో నిద్రించారు. మంగళవా రం తెల్లవారుజామున బైక్ మంటల్లో కాలిపోతుండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే బాధితుడిని అప్రమత్తం చేశారు. హుటాహుటిన కుటుంబసభ్యులందరూ బయటకు వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే బైక్ పూర్తిగా కాలిపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు.

పదవులకు వన్నె తీసుకురావాలి

- వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి


ఎస్వీని సత్కరించిన పార్టీ అనుబంధ విభాగాల రాష్ట్ర నాయకులు శ్రావణ్ కుమార్ తదితరులు

కర్నూలు (టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి అనుబంధ విభాగాల రాష్ట్ర అధ్యక్షులుగా, ఐటీ విభాగాల అధ్యక్షులుగా నియమితులైన నాయకులు పదవులకు వన్నె తీసుకురావాలని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. ఇటీవల రాష్ట్ర పదవుల్లో నియమితులైన రాష్ట్ర విద్యార్థి అనుబంధ విభాగం సంయుక్త కార్యదర్శి శ్రావణ్ కుమార్, కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఐటీ అధ్యక్షులు సురేంద్రబాబు మంగళవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీని శాలువా కప్పి గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, విద్యార్థుల సమస్యల పట్ల ప్రభుత్వంపై పోరాడాలన్నారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి


మాట్లాడుతున్న పుప్పాల సత్యనారాయణ

కర్నూలు(సెంట్రల్): భవన నిర్మాణ కార్మికులకు కోసం సంక్షేమ బోర్డును తిరిగి పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..అధికారంలోకి వచ్చిన సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని చెప్పిన సీఎం చంద్రబాబునాయుడు మాట తప్పారని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న 46 క్లెయిమ్‌లకు నిధులు విడుదల చేయకపోవడంతో అన్యాయమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదినెలలు గడుస్తున్నా ఒక్క సమస్యకు పరిష్కారం చూపలేదని విమర్శించారు. 50 సంవత్సరాలు నిండిన ప్రతి కార్మికుడికి రూ.6 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ సదుపాయాన్ని కల్పించాలనికోరారు. అనంతరం ప్రస్తుతం ఉన్న భవన నిర్మాణ కార్మిక సంఘాన్ని రద్దు చేశారు. నూతన కమిటీ ఏర్పాటయ్యే వరకు కన్వీనర్‌గా బి.నల్లన్న, కోకన్వీనర్లుగా నాగనబద్ధయ్య, రామచంద్ర, వీరేష్, లక్ష్మీనారాయలను నియమించారు.కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, ,నగర కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వనజీవికి చిత్రాంజలి



తన జీవిత కాలంలో కొన్ని లక్షల మొక్కలు నాటి సంరక్షించిన పద్మశ్రీ గ్రహీత వనజీవి డాక్టర్ జానకీ రామయ్య జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకం. నాలుగు రోజుల క్రితం ఆయన మృతి చెందడంతో నందవరం మండలం కనకవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు కాకే వెంకటేశప్ప తన చిత్రంలో నివాళులర్పించారు. ప్రకృతి వనజీవికి పుష్పాంజలి ఘటిస్తూ చిత్రాన్ని ఆవిష్కరించారు.

– కర్నూలు(సెంట్రల్)

వక్ఫ్ బిల్లుపై వైఎస్సార్‌సీపీ అలుపెరుగని పోరాటం

- వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ హాఫీజ్ మహమ్మద్ ఇలియాస్



కర్నూలు (టౌన్): రాజ్యాంగ విరుద్ధమైన వక్ఫ్ బిల్లుపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అలుపెరుగని పోరాటం చేస్తుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ హాఫీజ్ మహమ్మద్ ఇలియాస్ అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక బళ్లారి చౌరస్తాలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ కూటమికి తెలుగుదేశం, జనసేన, బీజేపీ సంపూర్ణ మద్దతు ఇవ్వడంతో వక్ఫ్‌బోర్డు బిల్లు మంజూరైందన్నారు. రాజ్యసభ, లోక్‌సభలో ముస్లింలకు బాసటగా నిలిచిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుగా నిలిచి బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసిందన్నారు. తాజాగా సుప్రీంకోర్టులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేసు వేసి పోరాటానికి నాంది పలికిందన్నారు. ముస్లింలకు మద్దతుగా నిలుస్తామని చెప్పిన టీడీపీ మోసం చేసిందన్నారు. ఎప్పటికీ ముస్లిం సమాజం టీడీపీని క్షమించదన్నారు. ఆపార్టీ ద్వంద ప్రమాణాలు బహిర్గతమయ్యాయన్నారు. ఒక వైపు మైనార్టీలకు మద్దతు ఇస్తున్నట్లు చెప్పుకుంటూ మరోవైపు ముస్లిం ప్రయోజనాలను కాపాడే సంస్థలపై దాడి చేసే విధంగా బీజెపీకీ కొమ్ము కాస్తుందన్నారు. నిజంగా ముస్లిం మైనార్టీల పట్ల ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎందుకు మౌనంగా ఉందన్నారు

హోరాహోరీగా బండలాగుడు పోటీలు


బండ లాగుతున్న వృషభరాజులు

సి.బెళగల్: క్రిష్ణదొడ్డి గ్రామంలో శ్రీ కోనా వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన పాలపళ్ల ఎద్ల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. వివిధ ప్రాంతాల నుంచి 9 జతలు ఎద్లు పోటీలలో పాల్గొన్నాయి. ఇందులో గద్వాల జిల్లా కంచుపాడు గ్రామం ఆంజనేయరెడ్డి ఎద్లు 4,736 అడుగుల దూరం లాగి మొదటి స్థానంలో నిలిచి రూ.40 వేలు, బి.తాండ్రపాడు గ్రామానికి చెందిన వరలక్ష్మి ఎద్లు 4,706 అడుగులతో రెండవ స్థానంలో నిలిచి రూ.30 వేలు, రాయవరం గ్రామానికి చెందిన నల్లారెడ్డి, దైవందిన్నె గ్రామానికి చెందిన నరసింహకు చెందిన సంయుక్త ఎద్దులు 4,250 అడుగలతో మూడవస్థానంలో నిలిచి రూ.20వేలు గెలుచుకున్నాయి. తర్వాతి స్థానాల్లో ఇనగండ్ల గ్రామానికి చెందిన మద్దిలేటి, ఉత్తనూరు గ్రామానికి చెందిన నరేష్‌ల సంయుక్త ఎద్లు, నందవరానికి చెందిన ఆంజనేయులు ఎద్లు, తిప్పనూరు గ్రామానికి చెందిన నాగేంద్ర ఎద్లు నిలిచాయి.